క్లుప్తంగా

పరామర్శ

మడకశిరరూరల్: మండల పరిధిలోని బచ్చలయ్యపాళ్యం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ క్రాంతి పథంలో పని చేస్తున్న యానిమేటర్ అంజినేయులను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

లేపాక్షిలో పర్యాటకుల సందడి


అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి: మండలంలోని వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం పర్యాటకుల సందడి చోటు చేసుకుంది. వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది పర్యాటకులు వచ్చి ఆలయంలోని వివిధ శిల్పాలు, చిత్రలేఖనాలు తిలకించారు. అదేవిధంగా నంది విగ్రహం, థీంపార్కు, జటాయువు పక్షి తదితర ప్రాంతాల్లో సందడి చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

హిందూపురం టౌన్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ గాంధీ సర్కిల్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలాజీ మనోహర్, నాయకులు యూనస్, జమీల్, రవూఫ్, మహబూబ్ బాషా, అజ్మతుల్లా, రఫిక్, ముభారక్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


రోగులకు మందులు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం: సీజనల్ జ్వరాలు, ఇతర వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైద్యులు ఇమ్రాన్‌ఖాన్, షాహిద్‌రామ్‌కుమార్ సూచించారు. స్థానిక సింగిరెడ్డిపల్లి 38వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రాధమ్మ ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన సవీరా ఆస్పత్రి, ముబారక్ హెల్త్ అండ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సాధారణ జబ్బులతో పాటు కళ్లు, గుండె, సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులు, మాత్రలు అందించి వైద్య సలహాలు అందజేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు అందిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.శివన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వై జంక్షన్‌లో లైట్ల ఏర్పాటు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వై జంక్షన్‌లో ఎస్‌ఐ విజయ్ కుమార్ లైట్లు ఏర్పాటు చేశారు. కొంతకాలంగా జంక్షన్ వద్ద అంధకారం ఉండడంతో ప్రమాదాలు జరిగిన విషయం విదితమే. ఇటీవల డీఐజీ అమ్మిరెడ్డి జంక్షన్‌ను పరిశీలించి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఎస్‌ఐ విజయ్‌కుమార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు.

లంబాడీల సంక్షేమానికి కృషి


ఎమ్మెల్యే వెంకటేశ్‌ను సన్మానిస్తున్న లంబాడీ సంఘం నాయకులు

పావగడ: లంబాడీలను తన గుండెలో పెట్టి చూసుకుంటానని ఎమ్మెల్యే హెచ్ వి వెంకటేశ్ అన్నారు. ఆదివారం స్థానిక అతిథి గృహంలో లంబాడీ సామాజికవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక మెజారిటీ తెచ్చి పెట్టిన స్థానిక లంబాడీల మేలు ఎప్పటికీ మరచి పోలేనని తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే వెంకటేశ్, అతడి తండ్రి మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్పను గజమాలలతో ఘనంగా సన్మానించారు. తాను తప్పకుండా తండాల్లో పర్యటించి లంబాడీల బాగోగులను తెలుసుకుంటానని భరోసా ఇచ్చారు. సంక్షేమానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వాల్యానాయక్ తదితర లంబాడీ నాయకులు, వెంకటేశ్ అభిమానులు పాల్గొన్నారు. వీర్లగొందిలో జరిగిన ఓ పెళ్లి వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

నిత్యాన్నదానానికి విరాళం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిర్వహించే అన్నదాన పథకానికి శ్రీ లక్ష్మీ నరసింహ కన్‌స్ట్రక్షన్స్ బెంగుళూరు వారు ఆదివారం రూ.1,50,000 విరాళాన్ని ఆలయ చైర్మన్ గోపాలకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు కంపెనీ ప్రతినిధులకు ప్రసాదం, స్వామి శేషవస్త్రం అందజేశారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు ముద్దమ్మ. మడకశిర మండలం బచ్చలయ్యపాళ్యం గ్రామం. ఈమె కుటుంబానికి వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.82,000, రైతు భరోసా ద్వారా రూ.40,500, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.23,140, వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా) రూ.4,912 తదితర సంక్షేమ పథకాల ద్వారా రూ.1,50,552 లబ్ధి చేకూరింది. సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం. మళ్లీ వైఎస్ జగన్‌కే మా దీవెనలు ఉంటాయని ముద్దమ్మ తెలిపింది.


బచ్చలయ్యపాళ్యంలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

మడకశిరరూరల్: పార్టీలకు అతీతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని జీవీపాళ్యం సచివాలయం పరిధిలోని బచ్చలయ్య పాళ్యం, బంద్రేపల్లి గ్రామాల్లో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరిన బుక్‌లెట్లను కుటుంబ సభ్యులకు అందించారు. తాగునీటి సమస్య ఉందని బచ్చలయ్యపాళ్యం గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కొత్త బోరు వేయించి నీటి సమస్య లేకుండా చూస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా దెబ్బతిన్న నీటి తొట్టికి మరమ్మతులు చేయించి నీటిని సరఫరా చేయిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వెళ్లకుండా ప్రభుత్వ పథకాలు తమకు ఇంటి వద్దకే అందుతున్నాయని మహిళలు, లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. బంద్రేపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పాలన చూసి ఓర్వలేక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పేదలు, దళితులను కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. అమరావతిలో సీఎం వైఎస్ జగన్ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటే చంద్రబాబు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. పేదలు, దళితులపై చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వచ్చే ఎన్నికల్లో పేదలు, దళితులు టీడీపీకి గుణపాఠం చెప్పి ఇంటికి పంపిస్తారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని సీఎంగా చేసుకొంటేనే పథకాలు అన్నీ సక్రమంగా అందుతాయని వివరించారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హత ఉన్న వారికి వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే వెళ్ళి అందిస్తున్నారన్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ జయరామప్ప, వివిధ మండల, జిల్లా కమిటీల సభ్యులు జమ్మానిపల్లి మూర్తి, తిప్పేస్వామి, కృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి, మారుతి, నాగభూషణ రెడ్డి, రమేష్, లక్ష్మీనారాయణ, శివన్న, ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఏఆర్‌రొప్పం గ్రామ సచివాలయం పరిధిలోని డీ రామగిరి గ్రామంలో సోమవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గీత, ఎంపీపీ కవిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు. నాయకులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులు అరికట్టాలి

రొద్దం: దళితులు, గిరిజనులపై దాడులకు తెగబడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆదివారం ఎస్‌ఐ నాగస్వామిని కోరారు. కార్యక్రమంగా జేఏసీ నాయకులు ముత్యాలు, ఎం. కొత్తపల్లి రవీంద్ర, రేకులకుంట రామాంజనేయులు, నాగరాజు, బాలు, ప్రసాద్ నరసింహులు పాల్గొన్నారు.

అలరించిన జబర్దస్త్ తారలు


మాట్లాడుతున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత తిమ్మక్క

హిందూపురం: పట్టణంలో ఆదివారం ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆంధ్ర, కన్నడ బుల్లి తెర తారలు, జబర్దస్త్ ఆర్టిస్టులు సందడి చేశారు. అలాగే రాష్ట్రపతి అవార్డు గ్రహీత 112 ఏళ్ల వయసున్న తిమ్మక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తిమ్మక్క జ్యోతి ప్రజ్వలన చేసి, హాజరైన వారికి ఎర్రచందనం మొక్కలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలన్నారు. అనంతరం జబర్దస్త్ బుల్లితెర బృందం నిర్వహించిన సంగీత కార్యక్రమం అలరించింది. సప్తగిరితో పాటు కన్నడ, ఆంధ్ర తారలు హాజరయ్యారు.

వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామి దేవరెద్దు వేల్పు


దేవరెద్దుకు పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి


వేల్పుకు హాజరైన జనం

గాండ్లపెంట: మండల పరిధిలోని గొడ్డువెలగల గ్రామ సమీపంలోని పాలవాండ్లపల్లిలో లక్ష్మీ నరసింహ స్వామి దేవరెద్దు వేల్పును ఆదివారం వైభవంగా నిర్వహించారు. కదిరి పరిసర మండలాల నుంచి వచ్చిన 8 దేవరెద్దులను ప్రత్యేకంగా అలంకరించి సంబరాలు జరుపుకున్నారు. ఈ వేల్పులో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొని దేవరెద్దులకు ప్రత్యేక పూజలు చేశారు. వేల్పును ఆచార్యకర్తలు శ్రీనివాసాచార్యులు, కదిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం వారు జరిపించారు. వేల్పుకు వచ్చిన వారికి సురతాని సుమతి, వి.శ్రీనివాసులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, సర్పంచ్ అంజనేయులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రవీంద్రానాయక్, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోండి

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే వ్యాధిని అరికట్టవచ్చని ఫోర్డ్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ అశ్వత్థనారాయణ తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో ఫోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య, ఫోర్డు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దకోట్ల చౌడేశ్వరీ దేవికి పూజలు


అలంకరణలో చౌడేశ్వరీ దేవి

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేక ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

100 మందికి వైద్య పరీక్షలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలో ఆదివారం కడపకు చెందిన హిమాలయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఉబేదుల్లా 100 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గీత, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


సుబ్బరాయుని పల్లిలో గేదెపై కూలిన భారీ వృక్షం


శ్రీరంగరాజు పల్లిలో గాలికి రోడ్డు పైకి కొట్టుకొచ్చిన రేకులు

పరిగి: మండలంలోని దక్షిణ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం, గాలీవాన బీభత్సం సృష్టించాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో వైర్లు తెగి పడ్డాయి. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి పడ్డాయి. శ్రీ రంగరాజు పల్లి, సుబ్బరాయన పల్లి, మోద పెద్దిరెడ్డి పల్లి, కోడిగినహళ్లి, బిందునగర్, సేవా మందిరం, తదితర ప్రాంతాల్లో భారీగా చెట్లు నేలకొరిగాయి. సుబ్బరాయనపల్లెలో గేదెపై భారీ వృక్షం కూలడంతో గేదె మృతిచెందింది. శ్రీ రంగరాజుపల్లిలో రేకులపై ఐరన్ సీట్లు గాలికి కొట్టుకుపోయాయి. మోద తదితర ప్రాంతాల్లో చెట్లు రోడ్డుకడ్డంగా నేలకొరగాయి, సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం గాలివాన ప్రజల్లో భయాందోళనలు కలిగించాయి, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో సరాఫరాకు అంతరాయం ఏర్పడింది.

వ్యర్థాలను నిర్మూలించాలి

పావగడ: స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఈనెల 20 నుంచి జూన్ 5 వరకూ అమలు చేసిన నా లైఫ్-నా స్వచ్ఛ నగరం ప్రాజెక్ట్‌లో భాగంగా సాధ్యమైనంత వరకూ వ్యర్థాలను నిర్మూలించాలని స్థానిక మున్సిపల్ ముఖ్యాధికారి షంషు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ ప్రాజెక్ట్‌లో వ్యర్థాలను తక్కువ చేయడం, మళ్లీ ఉపయోగించడం, పాత వస్తువులకు మరమ్మతులు చేసి ఉపయోగించాలన్నారు. వ్యర్థాలను పారేయకుండా పరిసరాలను రక్షించాలన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, మొబైల్ ఆర్ ఆర్ సెంటర్, శిరా రోడ్డు సంత మైదానంలో మూడు చోట్ల ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక 23 వార్డులకు చెందిన ఆట వస్తువులు, పాత బట్టలు, జీన్స్, చీరలు, దిన పత్రికలు, పాత పుస్తకాలు, ప్లాస్టిక్ సంచులు, పాల కవర్లు, ఎలెక్ట్రానిక్ తదితర వృథా వస్తువులను ఆర్ఆర్ఆర్ కేంద్రాల్లో అందజేయాలన్నారు. మున్సిపల్ శాఖ నుంచి స్టేషనరీ వస్తువులు, పెన్నులు, సేంద్రియ ఎరువులు, విద్యా సామాగ్రి, ప్రతి 250 గ్రాముల ప్లాస్టిక్ సంచులకు బట్ట సంచులు, డిజిటల్ ప్రమాణ పత్రాలు ఆర్ఆర్ఆర్ కేంద్రాల నుంచి పొందవచ్చన్నారు.

శుభకార్యం

రొద్దం: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త అల్లాబకాస్ కుమార్తె షబాన వివాహ వేడుకకు ఆదివారం ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీ రెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవి శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గోరంట్ల: గోరంట్ల సమీపంలోని మదరాస్సలో ఆదివారం గోరంట్ల మార్కెట్‌యార్డు చైర్మన్ నూర్‌మహమ్మద్, సోదరుడు ఎంపీటీసీ సభ్యుడు మునాఫ్ కుమార్తె వివాహం జరిగింది. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి తదితరులు హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు జయరాంనాయక్, ఎమ్మెల్యే సోదరుడు మల్లికార్జున, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్ సాహెబ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరస్ప తదితరులు పాల్గొన్నారు.

ఇది పాలేగాళ్ల అడ్డా

- నేటికీ చెక్కు చెదరని కోట గోడలు
- సముద్ర మట్టానికి 3వేల అడుగుల ఎత్తులో కోట నిర్మాణం
- కోటలో పది నీటి కొలనులు
- కరువు కాటకాల్లోనూ సమృద్ధిగా నీరు


కుందుర్పమ్మ కొండ ముఖచిత్రం

కళ్యాణదుర్గం/కుందుర్పి: శతాబ్దాల నాటి రాచరిక చరిత్రకు ఆనవాళ్లుగా జిల్లాలో నేటికీ ఎన్నో సాక్ష్యాలు సజీవంగా కనిపిస్తున్నాయి. ఇందులో అరుదైన దుర్గంగా ఖ్యాతి గడించింది కుసుమగిరి! చారిత్రక ఆనవాళ్లను బట్టి 1652లో కుసుమగిరిని కేంద్రంగా చేసుకుని ఈ ప్రాంతాన్ని పాలేగాళ్లు పాలించినట్లు తెలుస్తోంది. రాజులు పోయారు... రాజ్యాలూ పోయాయి. అయినా వారి పాలనకు గుర్తుగా కోటలు నేటికీ చెక్కుచెదరలేదు. నాడు కుసుమగిరిగా ఖ్యాతిగాంచిన పాలేగాళ్ల దుర్గం కాస్త కాలక్రమేణ కుందుర్పిగా మారింది. అత్యంత చరిత్ర కలిగిన కుందుర్పి దుర్గంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

300 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో..

కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పిలోని కొండకు ఘన చరిత్ర ఉంది. సముద్రమట్టానికి 3వేల అడుగుల ఎత్తులో కొండపై శత్రుదుర్భేద్యమైన కోట గోడలతో అత్యంత సుందరంగా ఈ కోటను అప్పట్లో పాలేగాళ్లు నిర్మించారు. జిల్లా కేంద్రం నుంచి 92 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కోటను చూసి వచ్చేందుకు బస్సు సౌకర్యం ఉంది. దాదాపు 300 ఎకరాలకు పైగా విస్తీర్ణమున్న కొండపై ఉన్న కోట శిఖరాగ్రంలో సింహాసన మంటపం, వ్యాయామశాల, కల్యాణ మంటపం, అక్కాచెల్లెమ్మల కొలను, రామలక్ష్మణ దొన, గన్నేరు దొన, గజ్జెల దొన, గండిపడిన దొన.. తదితర పదికి పైగా కొలనులు ఉన్నాయి. ఎంతటి కరువు కాటకాలు సంభవించినా ఈ కొలనుల్లో నీరు మాత్రం ఇంకి పోకుండా ఉండడం ఇక్కడి ప్రత్యేకతగా చరిత్ర పరిశోధకులు అంటున్నారు. ఈ కొలనుల వల్లనే కుందుర్పి చుట్టుపక్కల బోరుబావుల్లో నీటి మట్టం స్థిరంగా ఉంటోందని, దీంతో ఈ ప్రాంతం పాడిపంటలతో విరాజిల్లుతోందని పేర్కొంటున్నారు. దీంతో ఈ కొలనుల్లో నీటిని స్థానికులు అత్యంత పవిత్ర జలంగా భావిస్తుంటారు.

భక్తుల కొంగు బంగారంగా..

16వ శతాబ్దంలో కుసుమగిరిపై కోనేటిరాయుడు అనే రాజు గ్రామదేవత కుందుర్పమ్మను ప్రతిష్ఠించి, పూజించినట్లు చరిత్ర చెబుతోంది. దీంతో కుసుమగిరి కాస్త కుందుర్పమ్మ కొండగా... తర్వాతి కాలంలో గ్రామం సైతం కుందుర్పిగా మారినట్లుగా పూర్వీకులు చెబుతున్నారు. కొండపై ఉన్న కొలనుల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగినవి అక్కచెల్లెమ్మల దొన. ఏడు మంచాల నులకను నీటిలోకి జారి విడిచినా అక్క కొలను లోతు తెలియదని స్థానికులు చెబుతున్నారు. అక్క కొలను నుంచి చెల్లెమ్మ కొలనుకు మధ్య సొరంగం ఉంది. ఈ రెండు కొలనుల మధ్య పరస్పరం నీటి మార్పిడి జరుగుతుంటోందని చరిత్ర పరిశోధకులు నిర్ధారించారు. ఈ కొలనుల వద్ద అవివాహితులు గంగ పూజ చేస్తే వెంటనే వారికి వివాహమవుతుందని, సంతానం లేని వారికి బిడ్డలు పుడతారని ప్రజల విశ్వాసం. దీంతో ఎంతో మంది ఇక్కడ పూజలు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకూ కొండపై సందడి చేస్తుంటారు.

వందల మందికి జీవనోపాధి

కుందుర్పి దుర్గంలో సహజ సిద్ధంగా పెరిగిన సీతాఫలం చెట్లు వేల సంఖ్యలో ఉన్నాయి. ఏటా వీటి ఫలసాయం ద్వారా వందలాది కుటుంబాలకు జీవనోపాధి దక్కుతోంది. సీజన్‌లో రెండు నెలల పాటు ఇక్కడి సీతాఫలాలకు జిల్లాలోనే కాక పొరుగున ఉన్న కర్ణాటకలోనూ భారీ డిమాండ్ నెలకొంటోంది. వ్యాపారులు ఇక్కడికే వచ్చి సీతాఫలాలను కొనుగోలు చేసి, కర్ణాటక ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకుంటుంటారు.


కోటపై ఉన్న కల్యాణమంటపం


అక్కచెల్లెమ్మ కొలను

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్


హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

హిందూపురం: శ్రీ సత్యసాయి జిల్లా నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు ఆదివారం స్థానిక నవాజ్ ఆసుపత్రిలో వ్యాక్సినేషన్ నిర్వహించారు. సత్యసాయి జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఇర్షాద్ అహ్మద్, జిల్లా ఇమ్యూనైజషన్ అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో 96 మంది హజ్ యాత్రికులకు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు ఆనంద్, ఆంజాద్ యాత్రికులకు వ్యాక్సినేషన్, వైద్య పరీక్షలు చేపట్టారు. అనంతరం యాత్రికులందరికీ వైద్య సలహాలు, సూచనలు అందజేశారు.

పెద్దమ్మ తల్లికి బోనాలు


అలంకరణలో పెద్దమ్మ తల్లి

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతూరులో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. పంటలు బాగా పండాలని కోరుతూ మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం జంతుబలులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చౌడేశ్వరీ దేవతకు..

అమడగూరు: మండలంలోని రెడ్డివారిపల్లి మహిళలు చౌడేశ్వరీ అమ్మ వారికి ఆదివారం బోనాలను సమర్పించారు. ఏటా ఏప్రిల్‌లో జరిగే అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు అమ్మవారికి బోనాలను సమర్పించే వారు. అయితే కొన్ని అనివార్య కారణాల వలన అప్పట్లో సమర్పించని కారణంగా గ్రామపెద్దల నిర్ణయం మేరకు బోనాలను సమర్పించారు. ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం జంతుబలులు ఇచ్చారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా ఖరీఫ్‌లో సాగు చేసుకునేందుకు సబ్సిడీతో అందజేయనున్న విత్తన వేరుశనగ కాయల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వీఏఏ ప్రసన్నకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి బీజీ హళ్లి రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే విత్తన కాయలు పంపిణీ చేస్తామన్నారు. అదేవిధంగా ఈ నెలాఖరు లోపు విత్తన కాయలు పంపిణీ చేయడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

వేసవి శిబిరంలో ఆధ్యాత్మిక తరగతులు

అనంతపురం కల్చరల్: స్థానిక అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయ కళా ప్రాంగణంలో సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వేసవి శిబిరం నడుస్తోంది. హరిఃఓం ఆధ్యాత్మిక వేదిక తరఫున అనంత పద్మనాభయ్య అనే ప్రైవేట్ ఉపాధ్యాయుడు చిన్నారులకు ఆధ్యాత్మిక శిక్షణ ఇస్తున్నారు. రోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిబిరంలో సనాతన ధర్మాన్ని ప్రతిబింబించే శ్లోకాలు నేర్పిస్తున్నారు.

ఏమేమి నేర్పుతున్నారంటే...

విద్యార్థుల జ్ఞాపకశక్తిని పెంచేందుకు విష్ణు సహస్ర నామాలు నేర్పిస్తున్నారు. విష్ణుసహస్ర నామ పారాయణంలోని 108 శ్లోకాల్లో రోజూ పదింటిని విద్యార్థులు రాగయుక్తంగా ఆలపించేలా నేర్పిస్తున్నారు. గణపతిస్తోత్రం, నవగ్రహస్తోత్రం, లక్ష్మీ అష్టోత్తరం, ఆదిత్యహృదయం తదితర కఠినమైన శ్లోకాలు విద్యార్థులు అవలీలగా చెప్పేస్తున్నారు. అనంత పద్మనాభయ్య మాట్లాడుతూ మనదేశ ధర్మంపై ఉచిత బోధన చేస్తామని, రోజూ కనీసం గంట పాటైనా ఇతర విద్యలతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ పెంచేలా సాధన చేయిస్తున్నట్లు తెలిపారు. వేసవి శిబిరంలో ఆధ్యాత్మిక వేత్తలు, స్వామీజీలు పిల్లలను ఆధ్యాత్మిక పాఠాలు చెప్తున్నారన్నారు. దాతల ద్వారా చిన్నారులకు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు.